క్లుప్తంగా

చెత్త తొలగించారు



అంబాజీపేట కేవీ పాలెంలో పాఠశాల ఎదురుగా రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త

అంబాజీపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపాన ప్రాథమిక పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారి పక్కనే పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని పంచాయతీ కార్మిక సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఈ నెల 22న 'సాక్షి' దినపత్రికలో పారిశుధ్యం అస్తవ్యస్తం అనే వార్తా కథనం వెలువడింది. దాంతో ఎంపీడీఓ జి.సరోవర్ స్పందించి కొండలా పేరుకుపోయిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని మాచవరం పంచాయతీ కార్యదర్శి జీవీవీకే కుమార్‌కు ఆదేశించారు. అక్కడ ఉన్న చెత్తను కార్మికులతో తొలగించి పారిశుధ్య పనులు చేయించారు. ఇదిలా ఉండగా మురుగుకాలువలో పేరుకుపోయిన చెత్తను తూతూ మంత్రంగానే తొలగించారు.

రైతుల శ్రమదానం



రైతులు బాగు చేసుకున్న నగరం పంట, మురుగు కాలువ

మామిడికుదురు: నగరం గ్రామంలోని గుర్రాలచెరువు పంటకాలువ కం మురుగు కాలువ ఎంతో కాలం నుంచి పూడుకుపోయింది. ఈ కాలువపై సుమారు 350 ఎకరాల ఆయకట్టు ఉంది. భారీ వర్షాల సమయంలో దీని ద్వారానే మురుగునీరు ఓఎన్జీసీ జీసీఎస్ గేటు వద్ద ఉన్న వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌లోకి వెళ్లాల్సి ఉంది. పూడిక కారణంగా మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగింది. పంట పొలాలు ముంపు బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో రైతులు స్వచ్ఛందంగా ఈ కాలువను బాగు చేసుకునేందుకు శుక్రవారం ముందుకు వచ్చారు. రూ.20 వేలు సమకూర్చుకుని జేసీబీ సహాయంతో కాలువను బాగు చేసుకున్నారు. కార్యక్రమంలో తాటికాయల ఉదయభాస్కర్, వాకా శ్రీను, కడలి నాగేశ్వరరావు, వానరాశి త్రిమూర్తులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు

అంబాజీపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేయాలని నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీఓ జి.సరోవర్ అన్నారు. తొండవరం శివారు రజకపేట, మాచవరంలో జరుగుతున్న శానిటేషన్ పనులను శుక్రవారం ఎంపీడీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గుంతల్లోను, పరిసరాల వద్ద ఎక్కడ వర్షపు నీరు ఉన్న తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమలు విపరీతంగా పెరిగి జ్వరాల బారిన పడతారని ప్రజలకు వివరించారు. గ్రామంలో ప్రతిచోట శానిటేషన్ చేయాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు, ఈఓపీఆర్డీ బి.మమత, కార్యదర్శులు జీవీవీకే కుమార్, వి.లక్ష్మీపతి పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో పారిశుధ్య పనుల పరిశీలన

అయినవిల్లి: మండలంలోని వరద ముంపు గ్రామాల్లో పారిశుధ్య పనులను డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జిరాజు శుక్రవారం పరిశీలించారు. అధిక వర్షాలకు, గోదావరి వరదలకు ముంపునకు గురైన వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక తదితర గ్రామాల్లో డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జిరాజు పర్యటించారు. దోమల నివారణకు ఎబేట్, మలాథిన్ ముందు స్ప్రే చేయాలని సూచించారు. నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయాలని, పాగ ఫాగింగ్, బ్లీచింగ్ చల్లించాలని ఆదేశించారు. చెత్తకుప్పలు పెరిగిపోకుండా తొలగించాలన్నారు. పంచాయతీల విస్తరణ అధికారి (ఈవోపీఆర్డీ) గరిమెళ్ళ రవి, రాష్ట్ర సర్పంచుల సమాఖ్య కార్యదర్శి సలాది బుచ్చిరాజు, పంచాయతీ కార్యదర్శులు రామచంద్రరావు, ఆర్.సూర్యనారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయి సేవలపై ప్రత్యేక దృష్టి

ఆలమూరు: గ్రామీణ స్థాయిలో వైద్య ఆరోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కచ్చితత్వమైన సమాచారాన్ని సేకరించి మరింత మెరుగ్గా నాణ్యమైన సేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్) విభాగం విశేష సేవలను అందిస్తుందని జిల్లా వైద్యారోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక అధికారి కె.వీరబాబు అన్నారు. మండలంలోని సంధిపూడిలో ఆయుష్మాన్ భారత మందిర్‌లో శుక్రవారం ఆకస్మిక తనిఖీ జరిగింది. జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక అధికారి కె.వీరబాబు ఆధ్వర్యంలో అధికారుల బృందం శనివారం విచ్చేసి రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆ బృందం వైద్యారోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి సంతృప్తిని వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్లు పి.ఉమ, ఎం.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు వి.సువర్చల, ఆర్.భాను ప్రియాంక, హెల్త్ అసిస్టెంట్ ఆర్.నాగేశ్వరరావు, ఎంపీహెచ్ఎస్‌లు కె.విజయలక్ష్మి, కె.వెంకాయమ్మ, సీహెచ్ ఉమామహేశ్వరి, డీపీహెచ్ఎన్ఓ పీబీఎల్ కుమారి, డేటా మేనేజర్ ఎస్‌టీపీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక వద్ద ముంపులో ఉన్న అరటి తోట



మొండెపులంక శివారు పుచ్చల్లంకలో కుళ్లిపోతున్న బెండ తోట



అప్పనపల్లిలో గోదావరి నదిలో కూలిపోయిన కొబ్బరి, భారీ చింతచెట్టు



వరదనీటిలో పుచ్చల్లంక-నాగుల్లంక రహదారి

గోదావడి వెతలు

- కాజ్‌వేలను వీడని వరద
- పెరుగుతూ తగ్గుతూ దోబూచులాట
- వరద నీటిలోనే ప్రజల రాకపోకలు



నందంపూడిలో బొంతువారిపేటలో నీటముంపులో ఇళ్లు

మామిడికుదురు: గోదావరి వరద శాంతించినప్పటికీ ఇంకా వరద కాజ్‌వేను వీడలేదు. కాజ్‌వేపై నాలుగు అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. ఈ మార్గంలో అధికారులు రాకపోకలు నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద నీరు కాజ్‌వేను వీడకపోవడంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు ముంపు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పాటు వరద నీటిలోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లోని మత్స్యకార ప్రాంతాల్లో ఇంకా వరద నీటి ముంపు కొనసాగుతోంది. పాశర్లపూడి బాడవలో కనకదుర్గమ్మ ఆలయంతో పాటు మరో రెండు ఆలయాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. పెదపట్నంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. మూడు రోజుల పాటు తీర గ్రామాల ప్రజల్ని తీవ్ర కలవరపాటుకు గురి చేసిన గోదావరి వరద శాంతిస్తుండటంతో లంక గ్రామాల ప్రజలు కొద్దిగా ఊపిరి పీల్చుకుంటున్నారు.

వరద తాకిడికి కూలిపోతున్న చెట్లు

గోదావరి వరద ప్రవాహానికి నదీకోత తీవ్రమైంది. మూడు రోజులుగా ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి వరద ఉధృతికి అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిబాడవ ప్రాంతాల్లో శుక్రవారం పలు కొబ్బరి చెట్లు నదీగర్భంలో కూలిపోయాయి. అప్పనపల్లి బొంతువారిపేటలో భారీ చింతచెట్టుతో పాటు పలు కొబ్బరి చెట్లు నదిలో పడిపోవడంతో రైతులు తీవ్రంగా తల్లడిల్లుతున్నారు.

నీట మునిగిన ఇళ్లు

అంబాజీపేట: వైనతేయ గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో గ్రామాల్లో ఉండే కౌశికలు పొంగి పొర్లడంతో నందంపూడి, వాకలగరువు, తొండవరం గ్రామాల్లో కొబ్బరి, అరటి, కూర పాదులు నీటమునిగాయి. నందంపూడి బొంతువారి పేటలో ఇళ్లు నీట మునిగాయి. ఇళ్ల మధ్యకు వరద నీరు చేరి మోకాలిలోతులో ప్రవహిస్తుంది. వాకలగరువులో రజకపేటకు వెళ్లే రహదారిపై వరద నీరు చేరింది. ఈ మూడు గ్రామాల్లో ఉన్న కొబ్బరి, అరటి తోటల్లో వరద నీటితో ముంచెత్తింది.

తగ్గినట్టే తగ్గి...పెరిగిన ఉధృతి

సఖినేటిపల్లి: మండలంలో వరద ఉధృతి తగ్గినట్టే తగ్గి పెరగడంతో టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి గ్రామాల్లో వరద ఉధృతి శుక్రవారం యథాతథంగా కొనసాగుతోంది. ఈ నెల 21 రాత్రి నుంచి పోటెత్తిన వరద ఐదో రోజుకు చేరడంతో లంక గ్రామాల ప్రజలు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. సఖినేటిపల్లి లంక పరిధిలోని రేవు వద్ద, వశిష్ట గోదావరి పాయకు చేరి ఇళ్ల వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. అప్పనరామునిలంకలో పూర్తిగా మునిగిన ఏరియాల నుంచి గ్రామస్తులు పడవలపై బయటకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్ల వద్ద, ఓఎన్జీసీ కాలనీలోనూ వరద కొనసాగుతోంది. సఖినేటిపల్లి గ్రామ పరిధిలో గోదావరి పాయకు చేరి ఉన్న లాకుపేటలో వరద ఉధృతి కొనసాగుతోంది. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శిరీష పర్యవేక్షణలో మండలంలోని ఆయా వరద ముంపు గ్రామాల్లో పడవలపై టిన్‌ల ద్వారా తాగునీటి పంపిణీ కొనసాగుతోంది.

ముంపు బాధితులకు అల్పాహారం పంపిణీ

మండలంలో ఏటిగట్టుకు పూర్తిగా దిగువనున్న గ్రామం అప్పనరామునిలంకలో శుక్రవారం మలికిపురానికి చెందిన పరిశుద్ధ అగ్ని మినిస్ట్రీ అధ్యక్షుడు, పాస్టర్ జి.జయరాజు 100 మంది వరద బాధితులకు అల్పాహార పొట్లాలను అందజేశారు. అలాగే కల్వరి పెంతెకొస్తు సంఘం యూత్‌తో కలసి అల్పాహార పొట్లాలు, మంచినీటి ప్యాకెట్లు పాస్టర్ పంపిణీ చేశారు.

తగ్గని వరదతో ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు

పి.గన్నవరం: వశిష్ట, వైనతేయ నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో తగ్గినట్టే తగ్గి మళ్లీ వరద పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వరద ఉధృతి శుక్రవారం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. కె.ఏనుగుపల్లి రహదారిపై రెండడుగుల ఎత్తున వరదనీరు ప్రవహిస్తోంది. మానేపల్లి శివాయలంకకు వెళ్లే రహదారి వరదనీటిలో మునిగిపోవడంతో ప్రజలు పడవలపై వెళ్తున్నారు. మన జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, చాకలిపాలెం శివారు కనకాయలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. పుచ్చల్లంకలో రహదారి వరదనీట మునిగింది. వరదల కారణంగా లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ మానేపల్లిలో ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించారు. సహాయక చర్యలపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. శివాయలంకలో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నామని, లంక గ్రామాలకు వాటర్ టిన్నులు సరఫరా చేస్తున్నామని ఆర్డీఓ వివరించారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ త్రిశూలపాణి తదితరులు వరద ప్రాంతాల్లో పర్యటించారు.

ముంపులోనే అరటి పంట

అయినవిల్లి: వరద ఉధృతి క్రమేపి తగ్గుముఖం పడుతోంది. అయితే ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వే వద్ద వరదనీటి ఉధృతి అలాగే ఉంది. ఇంకా పడవలపై లంక ప్రజలు ప్రయాణం కొనసాగిస్తున్నారు. రేపటికి పూర్తిగా తగ్గుముఖం పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. లంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోని కాలనీల్లో ముంపు ఇంకా వీడలేదు. అలాగే అరటి, కూరగాయ, కోకో మొదలగు పంటలు ముంపులో ఉన్నాయి. పశుగ్రాసం కూడా పూర్తి వరదనీట మునిగి దెబ్బతింది. వీరవల్లిపాలెం, అయినవిల్లి లంక, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లో లోతట్టు గ్రామాల్లో వరద ముంపు వీడలేదు.



అప్పనరామునిలంకలో ఓఎన్జీసీ కాలనీలో ప్రవహిస్తున్న వరదనీరు



సఖినేటిపల్లి లాకుపేటలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద వరద ఉధృతి

అధికార మదంతో టీడీపీ నేత దౌర్జన్యం



కొత్తపేట విద్యుత్ ఏడీఈ కార్యాలయంలో ఫిర్యాదు అందజేస్తున్న బాధితుడు సత్యనారాయణశర్మ

కొత్తపేట: గతంలో ఎప్పుడే లేని విధంగా రాష్ట్రంలో టీడీపీ దౌర్జన్యాలు, దమన కాండలు ప్రజానీకాన్ని గగుర్పాటుకు గురిచేస్తున్నాయని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మాజీ ప్రచార కార్యదర్శి, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ ముసునూరి వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార మదంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు బలహీనులు, అమాయకులపై కూడా తమ ప్రతాపం చూపిస్తున్నారని ఆరోపించారు.

ఆ సంస్కృతి నియోజకవర్గానికి కూడా దాపురించిందన్నారు. మండలంలోని మందపల్లిలో అధికార టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధి ఒకరి ఆగడాలు పెచ్చుమీరిపోయాయని విమర్శించారు. కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద స్థలంలో ఉన్న రెండు విద్యుత్ స్తంభాలను తొలగించి ఒక స్తంభాన్ని బ్రాహ్మణ కులానికి చెందిన అయిలూరి సత్యనారాయణశర్మ అనే స్థానిక పూజారి స్థలంలో వేయించారని, ఇదేంటి తన స్థలంలో వేశారని అడిగితే ఆ నాయకుడు దౌర్జన్యానికి పాల్పడటంతో పాటు చంపేస్తానని భయభ్రాంతులకు గురిచేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై విద్యుత్ శాఖాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన బ్రాహ్మణ ఒంటరి మహిళపై ప్రజాప్రతినిధితో పాటు మరో టీడీపీ నాయకుడు తీవ్రంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఆమె కూడా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆయా ఫిర్యాదులపై పోలీసు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆ ఇద్దరు బాధితులకు న్యాయం చేయాలని బ్రాహ్మణ సంఘం తరఫున ముసునూరి విజ్ఞప్తి చేశారు.

ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ సౌజన్యంతో తొండవరం, వాకలగరువు పంచాయతీల వద్ద సర్పంచ్‌లు పేరాబత్తుల రామలింగరాజు (దొరబాబు), మద్దింశెట్టి దొరబాబుల అధ్యక్షతన శుక్రవారం మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావుతో పాటు అమలాపురం లోక్ అదాలత్ సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమలాపురం కిమ్స్, పి.గన్నవరం సీహెచ్‌సీ, అంబాజీపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఈ రెండు గ్రామాల్లో 270 మంది రోగులు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి వి.గౌతమి, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి, నామన వెంకటేశ్వరరావు, దిగుమర్తి చిట్టిబాబు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలి

అంబాజీపేట: మెళకువలతో కూడిన కఠినమైన సాధన చేస్తూ క్రీడలపై దృష్టి సారిస్తే ఏ పోటీల్లోనైనా బంగారు పతకాలు సాధించవచ్చని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. ఇటీవల కాకినాడలో తైక్వాండో ఉమ్మడి జిల్లా పోటీలో మెడల్స్ సాధించిన క్రీడాకారులను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం అభినందనలు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. వచ్చే నెల 2 నుంచి 4వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు వెళ్లే విద్యార్థులను అభినందనలు తెలిపారు. అనంతరం మెడల్స్ సాధించిన క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పచ్చని చెట్లు

సఖినేటిపల్లి: పర్యావరణ పరిరక్షణకు పచ్చని చెట్లు ఎంతో ముఖ్యమని ఎస్సై ఎస్.రాము అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీచైతన్య స్కూల్ నందు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా స్కూల్ యాజమాన్యం గ్రీన్ ఇండియా కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా ఎస్సై రాము పాల్గొని, స్కూల్ ఆవరణలో మొక్కనాటారు. విద్యార్థులకు పచ్చని చెట్లు ఆవశ్యకత గురించి ఆయన వివరించారు. అనంతరం స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ ఇండియా అవగాహన ర్యాలీకి ఎస్సై జెండా ఊపి ప్రారంభించారు. స్కూల్ రీజినల్ ఇన్‌చార్జ్ బి.రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ ఎస్.రజని, అకడమిక్ డీన్ ఎస్.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

వైనతేయ నదిలో దూకి దివ్యాంగుడి గల్లంతు

పి.గన్నవరం: స్థానిక కొత్త అక్విడెక్టుపై నుంచి ఒక దివ్యాంగుడు వైనతేయ నదిలోకి దూకి గల్లంతైనట్టు స్థానికులు అనుమానిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలు గ్రామానికి చెందిన సానబోయిన సత్యనారాయణ (65) అనే దివ్యాంగ వృద్ధుడు గురువారం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతడు గురువారం సాయంత్రం పి.గన్నవరం సెంటర్‌లోని ఒక హోటల్‌లో టిఫిన్ చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. అయితే శుక్రవారం ఉదయం అతని చెప్పులు, నడవడానికి సహకరించే ఇనుప స్టాండ్ స్థానిక కొత్త అక్విడెక్టుపై ఉన్నాయి. దీంతో అతడు నదిలోకి దూకి ఉంటాడని భావిస్తున్నారు. ఆ ప్రదేశాన్ని ఎస్సై బి.శివకృష్ణ, వీఆర్వో తోట శ్రీను పరిశీలించారు. వృద్ధుడు గల్లంతుపై రాజోలులో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

వరద బాధితులను ఆదుకుంటాం



బూరుగులంక రేవులో చిన్నారిని పడవ ఎక్కిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

పి.గన్నవరం: వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని, వారికి సహాయక చర్యలు అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని ఉమ్మడి జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని బూరుగులంక రేవులో శుక్రవారం ఆయన వరద పరిస్థితిని పరిశీలించారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలతో ఆయన మాట్లాడారు. వరద బాధితులకు, పంటలు నష్టపోయిన రైతులకు తాము అండగా ఉంటామని అన్నారు. లంక గ్రామాల్లో అధికారులు చేపడుతున్న సహాయక చర్యలపై ఆయన ఆరా తీశారు. పడవలు దాటే సమయంలో లంక గ్రామాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ దంగేటి అన్నవరం, వైఎస్సార్‌సీపీ నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, మంతెన రవిరాజు, అడ్డగళ్ల వెంకట సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

బట్టేలంకలో విజయ్‌దివస్ వేడుకలు

మలికిపురం: కార్గిల్ యుద్ధం జరిగి నేటికి 25 ఏళ్లు పూర్తైన సందర్భంగా మండలంలోని బట్టేలంకలో విజయ్‌దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బోనం సీతారత్నం ఆధ్వర్యంలో మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ మాట్లాడుతూ పాకిస్తాన్ కుయుక్తులను దీటుగా ఎదుర్కొని భారతదేశ ప్రజలు గర్వించేలా తమ శక్తియుక్తులను ప్రదర్శించి విజయతీరాలకు చేర్చి కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులకు ఘనంగా నివాళులు అర్పించడం మన బాధ్యత అని అన్నారు. భరించలేని ఎండ వేడిమి, మైనస్ డిగ్రీల చలిలోనూ అహోరాత్రాలు దేశ సరిహద్దులను కాపాడుతున్న సైన్యానికి మనమంతా కృతజ్ఞులమై ఉండాలని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు ఉల్లంపర్తి రామ్మూర్తి, ఉల్లంపర్తి ఏసురత్నంలను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆవుపాటి ఉమాలలిత శివజ్యోతి, పెన్మెత్స త్రిమూర్తిరాజు, బోనం చంటి, రాము, తాతారావు, అన్నంనీడి ఏసు, చిట్టాల సూర్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, బోనం రాజు తదితరులు పాల్గొన్నారు.



బట్టేలంకలో మాజీ సైనికులను సన్మానిస్తున్న సర్పంచ్ బోనం సీతారత్నం

పోలీసు నిఘా పెంచుతాం

అయినవిల్లి: గ్రామాల్లో దొంగతనాలు, దోపిడీలు, నేరాలు జరగకుండా పోలీస్ నిఘా పెంచుతామని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఎస్పీ కృష్ణారావు అయినవిల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పోలీస్ సిబ్బంది కొరత ఉందన్నారు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తెసుకెళ్లామన్నారు. తొలుత ఎస్పీ కృష్ణారావుకు స్థానిక ఎస్సై వి.రాజేష్, సిబ్బంది, పోలీసులు ఘనస్వాగతం పలికారు.

రెవెన్యూ రికార్డుల భద్రతకు ప్రాధాన్యం

మామిడికుదురు: రెవెన్యూ రికార్డుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని అమలాపురం ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రికార్డుల భద్రతకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ చేపట్టామన్నారు. రికార్డులను భద్రపర్చేందుకు అవసరమైన ట్రాక్‌లు, బీరువాలను సమకూరుస్తామన్నారు. వీఆర్ఏలతో మూడు షిఫ్టుల్లో కాపలా ఏర్పాటు చేస్తామన్నారు. వీరికి తోడు పోలీసులు కూడా నిఘా ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో ఈ భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.మేరికమ్మ, ఆర్ఐ అలీ, రెవెన్యూ ఉద్యోగులు ఉన్నారు. అనంతరం గోదావరి వరద పరిస్థితిపై మండల ప్రత్యేకాధికారి అయిన ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. అప్పనపల్లి కాజ్‌వే వద్ద ముంపును పరిశీలించారు.

ప్లాస్టిక్‌తో అనర్థాలపై అవగాహన

పి.గన్నవరం: ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అందరూ అవగాహన కల్పించుకోవాలని తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి అన్నారు. పి.గన్నవరం శివారు అంబటివారి పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మమత స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రులకు ప్లాస్టిక్ వల్ల వచ్చే అనర్థాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ విద్యార్థులకు జాన్ సమకూర్చిన పలకలను వారు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటేశ్వరి, కోట ఏడుకొండలు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దీపావళి బాణసంచా వేలం

అంబాజీపేట: పేలుడు పదార్థాల (ఎక్స్‌ప్లోజివ్స్) చట్టం ప్రకారం స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్న దీపావళి బాణసంచాను కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 29న వేలం వేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఉత్తర్వుల ప్రకారం, మాచవరం గ్రామం పండువారిపేట సమీపాన ఉన్న ఖాళీ స్థలంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్.ఐ చెప్పారు. పేలుడు పదార్థాల లైసెన్స్ కలిగిన ఉన్న వ్యక్తులు వేలానికి హాజరు కావాలని ఎస్సై కోరారు.

ఇరుకు పీహెచ్‌సీ భవనంతో రోగుల అవస్థలు

సఖినేటిపల్లి: మండల కేంద్రంలో తాత్కాలికంగా పీహెచ్‌సీని నడుపుతున్న ఇరుకు భవనంతో నిత్యం వైద్యసేవలు నిమిత్తం వస్తున్న రోగులు నానా అవస్థలు పడుతున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్‌మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామ కృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు అన్నారు. శుక్రవారం సఖినేటిపల్లిలో రూ.కోటి 50 లక్షలతో నిర్మితమవుతున్న నూతన పీహెచ్‌సీ భవనం పనులను ఆ పార్టీ నాయకులతో కలసి వారు పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన కొద్దిపాటి బకాయిలను తక్షణం అధికారులు చెల్లించి, త్వరితగతిన భవనం వినియోగంలోకి తేవాలని వారు డిమాండ్ చేశారు. కాగా పీహెచ్‌సీకి సరిపడా సిబ్బంది ఉన్నప్పటికీ సదరు తాత్కాలిక భవనంలో సేవలు అందించేందుకు అవకాశం లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని మాలే, చెంపాటి, రాంబాబు పేర్కొన్నారు.

సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే లేఖ

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు పనులు ప్రారంభించాలని కోరుతూ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు లేఖ రాశారు. లేఖను శుక్రవారం విలేకరులకు విడుదల చేశారు. మలికిపురం మండలంలో లక్కవరం, సఖినేటిపల్లి మండలంలో గుడిమూల లలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. అలాగే లక్కవరం, రాజోలు సబ్ స్టేషన్ల సామర్థ్యాన్ని 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకు పెంచాలని కూడా ఆ లేఖలో కోరారు. ఇక్కడ విద్యుత్ సామర్థ్యం తక్కువగా ఉండడం వల్ల ప్రధానంగా తాగునీటి పంపింగ్‌పై తీవ్ర ప్రభావం చూపి ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రెయిన్‌కోట్ల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు అందజేస్తున్న దాత ముల్లారావు, సర్పంచ్ లావణ్య తదితరులు

ఆలమూరు: స్థానిక గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు శుక్రవారం రెయిన్ కోట్లు పంపిణీ జరిగింది. సర్పంచ్ నేలపూడి లావణ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దాత సిద్ధార్థ స్కూల్ కరస్పాండెంట్ కె.ముల్లారావు ముఖ్యఅతిథిగా పాల్గొని కార్మికులకు రెయిన్‌కోట్లు అందజేశారు. వాతావరణ పరిస్థితులు ఏ విధంగా ఉన్నా కష్టించి పనిచేస్తూ పరిశుభ్రతకు కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికులకు అండగా ఉండేందుకు తమ వంతుగా ఈ రెయిన్ కోట్లు పంపిణీ చేశామని ముల్లారావు వ్యాఖ్యానించారు. నాతి కుమార్‌రాజా, గ్రామ కార్యదర్శి కె.సంజీవరెడ్డి పాల్గొన్నారు.

శాకంబరిగా సంతోషిమాత



శాకంబరి అలంకరణలో వాడపాలెం సంతోషిమాత

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో వేంచేసిన సంతోషిమాత అమ్మవారు శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం, శుక్రవారం సందర్భంగా ఆలయ కమిటీ ప్రెసిడెంట్ బండారు లక్ష్మణరావు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు పీఎస్ఎన్ మూర్తి అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పలువురు భక్తులు కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిపారు. వాడపాలెం పరిసర ప్రాంతాల నుంచి మహిళలు, భక్తులు శాకంబరి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు.